క్లుప్తంగా

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం రశీదు అందిస్తున్న కమిటీ సభ్యులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి భక్తులు ఆదివారం విరాళం ఇచ్చారు. పట్టణానికి చెందిన సామల సువర్ణ ప్రతాప్‌రెడ్డి, గౌడ అనితశ్రీనివాస్ రూ.10,116, జోలపురం శ్రావణి రూ.2,016 ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి రాజేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మామిడి ఐలయ్య, పురం శంకర్, చిదిరాల శ్రీనివాస్, మాందాడి అశోక్‌రెడ్డి, గురుస్వామి, మధు, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత



జీపీ సిబ్బందికి దుస్తులు అందిస్తున్న ముస్లింలు

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ముస్లింలు దుస్తులు అందించారు. అనంతరం వారితో కేక్‌కట్ చేయించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, మజీద్ కమిటీ సభ్యులు,యువకులు శ్రీనివాస్, స్వామి, కొంరయ్యున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పట్టణంలోని నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ ఆదివారం ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రజలు ఆరోగ్యం, సుఖసంతోషాలతో ఉండాలని, ఆర్థికంగా ఎదగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పంజాల అనిల్‌గౌడ్ , మార్కా స్వరాజ్‌ప్రేమ్‌కుమార్, పాత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం



సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన ఇ. మాధవరెడ్డిని(రిటైర్డ్ టీచర్) పూర్వ విద్యార్థులు (1976–77 పదోతరగతి) సన్మానించారు. ఆదివారం ఆయన ఇంట్లో దంపతులకు శాలువా కప్పి పాదాభివందనం చేశారు. మండలంలోని ఇందుర్తి పాఠశాలలో మాధవరెడ్డి సైన్స్ సబ్జెక్ట్ బోధించారని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్దన్న, సత్యం, సత్యనారాయణ రెడ్డి, అనంతరెడ్డి, కిషన్‌రెడ్డి, చంద్రమౌళి, పర్శరాములు, తిరుపతిరెడ్డి, తదితరులున్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

చొప్పదండి: అయ్యప్పస్వామి, హిందు ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని చొప్పదండి మండల బ్రాహ్మణ అర్చక పురోహితుల సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సనాతన హిందు ధర్మంపై మాటలతో దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, హిందు దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని గుర్తించి చట్టపరమైన కేసుల నమోదు చేయడంతో పాటు, పీడీ యాక్ట్ నమోదు చేయాలని, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని సంఘం మండల శాఖ అధ్యక్షుడు సింహాచలం ప్రభాకరాచార్యులు, చక్రధరాచార్యులు, సత్యనారాయణ కోరారు.

కోటి సంతకాల సేకరణ



కరీంనగర్: విశారదన్ మహరాజ్ బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా జిల్లా కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయ కూడలి వద్ద జిల్లా కార్యవర్గం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కన్వీనర్ రాకేశ్, మీడియా ఇన్‌చార్జి రవికిరణ్, వీణవంక మండల అధ్యక్షుడు సదానందం, రాష్ట్ర మీడియా సభ్యులు రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక నిర్వీర్యం

- లక్షలు వెచ్చించి వైకుంఠథామాల నిర్మాణం
- క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- దహన సంస్కారాలు చేయడానికి అష్టకష్టాలు పడుతున్న జనం



చెల్పూర్ గ్రామంలో కొనసాగుతున్న వైకుంఠథామం నిర్మాణ పనులు

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లో దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వైకుంఠథామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి సుమారు రూ.12.50 లక్షలకుపైగా నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించినా నిర్వహణ లేక నిర్వీర్యమవుతున్నాయి. దీనికి తోడు ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలతోపాటు వాటి అనుబంధ గ్రామాలను కలుపుకొని మొత్తం 23 జీపీలు ఉన్నాయి. స్థల భావం కారణంగా కొన్నిచోట్ల వైకుంఠథామాలను వాగులు, వంకలు, కెనాల్ సమీపంలో నిర్మించారు. వానాకాలంతో పలుచోట్ల వైకుంఠథామాల్లోకి నీరు చేరింది. అంతేకాక వైకుంఠథామాలకు వెళ్లే దారి సరిగ్గా లేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైకుంఠథామాల చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. మేజర్ గ్రామపంచాయతీ చెల్పూర్‌లో వైకుంఠథామం నిర్మాణ స్థలం కోర్టు వివాదాల్లో ఉండటంతో మరోచోట నిర్మిస్తుండగా నిధుల సమస్య కారణంగా ఇప్పటి వరకు పూర్తి కాలేదు.

అడ్డుకట్ట పడేనా..?

వైకుంఠథామాలు పలుచోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో వైకుంఠథామాల గదులకు ఉండే తలుపులు, కిటికీలు, నీటి కొళాయిల పైపులు, గోడలు, ఇతర వస్తువులను ధ్వంసం చేస్తున్నారు. వీరి కారణంగా మరమ్మతుల కోసం అదనంగా నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిర్వహణపై దృష్టి పెట్టాలి



ఆఖరి మజిలీకి సైతం కష్టాలు దురదృష్టకరం. వైకుంఠథామాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి. గ్రామంలో నిర్మిస్తున్న వైకుంఠథామానికి నిధులు కేటాయించాలి.

– పంజాల శ్రీనివాస్, గ్రామస్తుడు, చెల్పూర్

ప్రత్యేక నిధులు కేటాయించాలి



వైకుంఠథామాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. వైకుంఠథామం వద్ద అటెండర్ నియామకంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిధులు లేక ఇబ్బంది పడుతున్నాం. నిధులు కేటాయిస్తే వైకుంఠథామాల నిర్వహణ పక్కాగా జరుగుతుంది.

– బింగి కరుణాకర్, సర్పంచ్, రంగాపూర్.

నిధుల కేటాయింపులో జాప్యం



గ్రామంలో వైకుంఠథామ నిర్మాణం స్థల కారణంగా ఆలస్యమైంది. మరో వైపు నిధుల కేటాయింపులో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. చేతి నుంచి డబ్బులు పెట్టి మరీ అభివృద్ధి పనులు పూర్తి చేస్తే బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్య ధోరణి నెలకొంది. వైకుంఠథామ నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపడుతాం.

– నేరెళ్ల మహేందర్‌గౌడ్, సర్పంచ్, చెల్పూర్

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు



ముస్తాబైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

రామడుగు: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని మండలంలోని పలు దేవాలయాలను ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబయ్యాయిరు. వెలిచాల గ్రామం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. నిత్య కల్యాణోత్సవంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెదిర, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉదయం ఐదున్నర గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ కందుల సుధాకర్ అన్నారు. ముక్కోటి ఏకాదశి నాడు మాత్రమే ఏ ఆయంలోనైనా స్వామివారు ఉత్తర ద్వారం గుండా దర్శనం ఇస్తారు. కానీ ఈ క్షేత్రంలో మోక్ష రాముడిగా పవళించి నిత్యం ఉత్తరముఖ ద్వారం ద్వారా భక్తకోటిని అనుగ్రహిస్తూ ఉండటం ఇక్కడి ప్రత్యేకత అని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఆధ్యాత్మికం



చొప్పదండి: పూజలు చేస్తున్న భక్తులు

అయ్యప్ప ఆలయంలో పూజలు

చొప్పదండి: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పలువురు గురుస్వాముల ఇరుముడి ధారణకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆ లయ అర్చకుడు పాలోజు చరణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురు స్వామి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శబరిమల యాత్రకు బయలుదేరారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారణ స్వాములకు గురుస్వాములు ఇరుముడులు ధరింపజేసి అనంతరం శబరిమలకు తరలివెళ్లారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు రాధిక దంపతులు, భక్తులు, మాలధారణ స్వాములకు నిత్య అన్నదానంలో భాగంగా భిక్ష నిర్వహించారు.

విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పత్రిక అందజేత



శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ రవీందర్

చిగురుమామిడి: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు జెడ్పీటీసీ గీకురు రవీందర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 4న చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధపోరాట యోధుడు సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు తాల్లపల్లి తిరుపతిగౌడ్ ఆహ్వానపత్రిక అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బెజ్జంకి అంజయ్య, చిగురుమామిడి గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ రఘునాథరెడ్డి, గొల్లపల్లి అరుణ, మొగిలి, శ్రీనివాస్, రాజయ్య, పర్శరాములు, తోడేటి శ్రీనివాస్, సురేశ్ తదితరులున్నారు.

అంబరాన్నంటిన ‘నూతన’ సంబరాలు



హుజూరాబాద్: సీఎస్ఐ చర్చిలో కేక్ కటింగ్



చొప్పదండి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



హుజూరాబాద్‌రూరల్: రంగాపూర్‌లో..

హుజూరాబాద్: నూతన సంవత్సర వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టి కోరికలు నెరవేర్చాలని ఇష్ట దైవాలను దర్శించుకున్నారు. హుజూరాబాద్‌లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


చొప్పదండి: పట్టణంలోని హోలీషాలోం చర్చిలో బిషప్ డాక్టర్ గుండేటి శాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కట్ చేశారు. ఆగ్నస్ వయోలా ఆధ్వర్యంలో గీతాలాపన, అనంతరం శాంతి సందేశం అందించారు.

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని రంగాపూర్ గ్రామం కల్వరి చర్చిలో ఫాదర్ నెల్సన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల్సన్ మాట్లాడుతూ ఏసు చూపిన మార్గం ప్రపంచానికి దిక్సూచిగా మారిందని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ ప్రయాణించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవ భావాన్ని పెంపొందించుకోవాలని, దైవ భక్తితో ప్రతిదాంట్లో విజయం సాధించవచ్చన్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన దుస్తులను క్రైస్తవులకు పంపిణీ చేశారు. పాటలు, నృత్యాలలతో పిల్లలు ఏసును కొనియాడిన తీరు విశేషంగా ఆకట్టుకుంది.


సైదాపూర్: మండలంలోని గొడిశాలకు చెందిన యువకులు హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వరకు 14 కేఎం రన్‌తో 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు. ధూమపానం, మద్యపాన రహిత సంవత్సరంగా పిలుపునిస్తూ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు యువకులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు కార్యక్రమంలో పాల్గొనగా సైదాపూర్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం అభినందించారు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లోని ఐరిస్ పాఠశాలలో పరివర్తన్ పేరుతో ఉత్సవాలు నిర్వహించారు. పారమిత, ఐరిస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐరిస్‌లో విద్యార్థులకు అత్యుత్తమ విద్యతో పాటు, విద్యార్థిలో దాగున్న ప్రతిభను వెలికితీస్తున్నామన్నారు. నేటి ప్రపంచంతో పోటీ పడగల విద్యార్థులను తయారుచేయడం ఐరిస్ ప్రత్యేకత అని తెలిపారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. డైరెక్టర్లు విజయ్, అనుకర్‌రావు, ప్రసూన, వినోద్‌రావు, ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, సంజయ్ భట్టాచార్జి, ఆనంద్ కమలాకర్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మానకొండూర్: మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు పిట్టల మదు, ఉండింటి శ్యాంసన్, నెల్లి మురళీ, పిండి సందిప్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సైదాపూర్: అభినందిస్తున్న ఎస్సై ఆరోగ్యం



తిమ్మాపూర్: డ్యాన్సులు చేస్తున్న విద్యార్థులు



మానకొండూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

భీమా కోరెగావ్ స్ఫూర్తితో పోరాడుదాం

హుజూరాబాద్: కులవ్యవస్థ, అంటరానితనం నుంచి విముక్తికి మహర్ కులానికి చెందిన దాదాపు 500 మంది సైనికులు 1818 జనవరి 1న బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున వీరోచితంగా పోరాడి విజయం సాధించారని, భీమా కోరెగావ్ స్ఫూర్తితో పోరాడుదామని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పాక సతీశ్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ... విజయానికి సూచికగా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం భీమా కోరెగావ్ దగ్గర మహర్ అమరవీరుల స్తూపం నిర్మించి యుద్ధంలో మరణించిన 22 మంది పేర్లు లిఖించారని తెలిపారు. స్తూపాన్ని 1927లో బాబా సాహెబ్ అంబేడ్కర్ సందర్శించి భీమా కోరెగావ్ చరిత్రను బయటికి తీసుకువచ్చారన్లి పేర్కొన్నారు. పీష్వాలు అనుసరిస్తున్న అంటరానితనం అణిచివేతకు వ్యతిరేకంగా విముక్తి కొరకు పాల్గొన్నారని, దళితులకు భూమి, ఆత్మగౌరవం, ఆయుధాలు నిరాకరించి పశువులకన్న హీనంగా చూసిన పీష్వాల పాలనలో పోరాటం తప్పా మరేమీ మిగల్లేదని, అధిక సంఖ్యలో సైన్యం కలిగిన పీష్వాల తో పోరాడి విజయం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా అరులకు మాల మహానాడు ఆధ్వర్యంలో నివాళి అర్పించామన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి పసుల స్వామి, నాయకులు రాజేందర్, చౌడమల్ల రాజు, జూపాక శ్రీనివాస్, ముక్క రఘుపతి, ముక్క శ్రీనివాస్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్ సీఐగా రమేశ్



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సై రాజన్న

హుజూరాబాద్: హుజూరాబాద్ టౌన్ సీఐగా బొల్లం రమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వీరబత్తిని శ్రీనివాస్ రామగుండం కమిషనరేట్ సీఎస్‌బీ–1కి బదిలీ అయ్యారు. సీఐకి ఎస్సైలు రాజన్న, ఆసీఫ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రాజు



వడ్ల రాజు

శంకరపట్నం: వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన వడ్ల రాజు నియామకమయ్యారు. ఖమ్మంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నారు. ఉపాధిహామీ కూలీలకు కనీస వేతన చట్టంపై నిరంతరం అవగాహన కల్పించేందుకు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య



మాట్లాడుతున్న నాయకులు

సైదాపూర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన రాయిశెట్టి చంద్రయ్యను నియమించినట్లు జిలా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్, ముదిరాజ్ మహాసభ మండల నాయకులు మండల కేంద్రంలో మాట్లాడారు. చంద్రయ్య ఉమ్మడి ఆకునూర్ గ్రామ సర్పంచ్‌గా, భార్య కోమల సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పదిహేనేళ్లు పనిచేసి మండలంలో మంచి గుర్తింపు పొందారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు చంద్రయ్యను గుర్తించి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించిందని రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు అశోక్, రవీందర్, పవన్, పెసరు రాజయ్య, శ్రీనివాస్,సమ్మయ్య, మల్లేశ్ ఉన్నారు.

మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

కరీంనగర్: భీమ్ కోరేగావ్ మహర్ సైనికుల త్యాగాలు, విజయాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ తరాలు మనువాదానికి వ్యతిరేకంగా పోరాడి సమ సమాజాన్ని నిర్మించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. భీమ్ కోరేగావ్ విజయ్ దివస్ సందర్భంగా ఆదివారం కోర్టుచౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విజయోత్సవ కేక్ కట్‌చేసి మహర్‌వీరుల విజయాలను కీర్తించారు. మహర్‌వీరుల అంకితభావం, పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజంలో నెలకొన్న మతోన్మాదం, కులవివక్షత, అణిచివేత, దాడులు, హింసకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బహుజన రాజ్యాధికార సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మేడి రాజావీరు, మామిడిపల్లి బాపయ్య, మేడి మహేశ్, మొగురం రమేశ్, సుంచు లతశ్రీ, సాంబారి కొమురయ్య, గరిగే ప్రభాకర్, గొట్టె అర్జున్, పారునంది జలపతి, దేవుని కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో...

తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమ్ కోరేగావ్ విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, నాయకులు సుద్దాల లక్ష్మణ్, కళ్లెపెల్లి శంకర్, సుల్తాన్, గోష్కిశంకర్, మామిడిపల్లి కృష్ణ, బోయినిపల్లి చంద్రయ్య, మీసాల సాయిలు, చామనపల్లి చంద్రశేఖర్, నాగరాజు, కల్వల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న బాల్య మిత్రులు

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన దాసరి సంపత్ కుమారుడు అరవింద్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఆదివారం సంపత్ బాల్యమిత్రులు వైద్య విద్యకోసం రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రాల రాజు, ఎండీ జలీల్, చంద్రమౌళి, తిరుపతి, రాములు, స్వరూప, బాబు , జానీ, రమేశ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సంఘం సభ్యులు

జమ్మికుంట: పట్టణంలో ఆర్యవైశ్య మహిళలు, డైమండ్ కిట్టి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఐక్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మురికి పూర్ణిమ, సీహెచ్ గిరిజ, యాంసాని లత, గౌరిశెట్టి సుజాత, కావ్య, మంజుల, వాణి, అనిత, స్వాతి, జ్యోతి, కవిత, నాగరాణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.